31082024-DIS-04_Layout 1 8/31/2024 3:22 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మహిళలపై చిన్నచూపు దేశానికే అరిష్టం

కనకదుర్గ దంటు
89772 43484

వేదాలలో ప్రవచించిన ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధించాలంటే వివాహ వ్యవస్థ, అందులో ముఖ్యంగా లింగ సమానత్వం ఉండాలన్నది ధర్మ సిద్ధాంతం. సమానత్వం ఎప్పుడు సిద్ధిస్తుంది? స్త్రీలు, పురుషులు ఇద్దరికీ ఒకరి మీద ఇంకొకరికి ప్రేమ, ఆదరం, గౌరవం ఉన్నప్పుడు అది సాధ్యమవుతుంది. వివాహంలో భార్యాభర్తల మధ్య, కుటుంబంలో స్త్రీలు, పురుషుల మధ్య, సమాజంలో కూడా ఈ రెండు వర్గాల మధ్య ఇటువంటి గౌరవం, వారి ఆవశ్యకత గురించి అవగాహన లోపిస్తే దేశం ఎలా ఉంటుంది? ఇదిగో ఇప్పుడు మనం బతుకుతున్న భారతదేశంలా ఉంటుంది. స్త్రీల పట్ల క్రూరంగా ఉన్నవాడెవడూ బాగు పడలేదు, పడడు కూడా!

ఒక దేశం సుభిక్షంగా ఉండి, ప్రగతి పథంలో పయనించాలంటే ఆ దేశ రాజ్యాంగం, దానిని పటిష్ఠంగా అమలుపర్చాల్సిన నాయకులు ధర్మబద్ధంగా ఉండాలి. నియమాలు చిన్నాభిన్నం చేసి, వ్యవస్థలను నిర్వీర్యం చేసి తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తే ధర్మం మాట పక్కనపెట్టి, న్యాయం కూడా జరగదు. దీనికి సరైన ఉదాహరణ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు, 5 నెలల జైలు జీవితం. చివరికి ఆధారాలు చూపని ఈడీ, సీబీఐలను ముక్కచీవాట్లు పెట్టి ఆవిడకి బెయిలు మంజూరు చేసిన సుప్రీం కోర్టు నిర్ణయం, నరేంద్ర మోదీ ప్రభుత్వ ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తుందో ప్రపంచానికి చాటిచెప్పింది. వీరత్వంతో పాండవులను గెలవలేమని గ్రహించిన దుష్ట చతుష్టయం (దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు) మోసంతో గెలిచి, వారిని వనవాసానికి పంపారు. కానీ, చివరి గెలుపు ఎవరిది? ధర్మం ఎవరివైపు ఉందో వారిదే!

నిర్భయ ఉదంతం (2012) అడ్డుపెట్టుకొని 2014లో ఎన్నికలు గెలిచిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో స్త్రీల పరిస్థితి ఎలా ఉంది? నిజానికి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగు లేకపోతే ఎక్కువ వేదన, కష్టం అనుభవించేది స్త్రీలే. కార్పొరేట్ పక్షపాత మోదీ పాలనలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారి స్థితి ఎంత దిగజారిందో గణాంకాలే చెప్తున్నాయి. ధరలు నియంత్రించటంలో కాంగ్రెస్ విఫలమైందని డప్పుకొట్టి అధికారం చేజిక్కించుకున్న బీజేపీ పాలనలో ధరలు 2014లో ఉన్న కంటే సుమారు 70 శాతం పెరిగాయి. పోనీ, సామాన్యుల సంపాదన ఏమైనా పెరిగిందా అంటే అదీ లేదు, దేశం బాగు పడిందీ లేదు. 45 శాతం ఉన్న యువతకు ఉద్యోగాలు సృష్టించలేదు, విద్యారంగం నాశనమైంది. మరి కేంద్ర ప్రభుత్వం విపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాల నిధులు కూడా మింగి వెలగబెడుతున్న దేమిటి? 148 కోట్ల జనాభా ఉన్న దేశంలో పది మంది అపర కుబేరులుంటే చాలదు. సామాన్యుల కనీస అవసరాలు తీరాలి. ఈ సామాన్య కుటుంబాలలో స్త్రీల పరిస్థితి మరింత దిగజారింది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా ప్రభుత్వ పాఠశాలలలో బాలికల శాతం ఘోరంగా తగ్గిపోయింది. 'బేటీ బచావ్, బేటీ పఢావ్', కాస్తా 'బేటీ ఛిడావ్' అయిపోయి అత్యాచారాలు పెరిగాయి. అహంకారంతో నేరాలు చేస్తున్న తమ అనుయాయులకు బీజేపీ శిక్షలు వేయకపోగా, సన్మానాలు చేస్తున్నది.

బలమైన ప్రత్యర్థులైన కేజ్రీవాల్‌ను నియంత్రించటానికి సిసోడియాను, కేసీఆర్ మీద పగ తీర్చుకోవడానికి కవితను అన్యాయంగా జైలులో పెట్టిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు ఏ శిక్ష వేయాలి? ఎన్నికల అధికారులను, ఈవీఎంలను అడ్డం పెట్టుకొని అధికారం చేజిక్కించుకోవచ్చు. కానీ, ప్రజల మన్నన పొందగలరా? అసలు దేశంలోని స్త్రీలందరూ ఒకసారి తమ పట్ల బీజేపీ ప్రభుత్వం ఎట్లా ప్రవర్తిస్తుందో గమనిస్తున్నారా? అర్థం చేసుకుంటున్నారా? 148 కోట్ల భారత జనాభాలో సుమారు 66 కోట్ల మంది హిందూ స్త్రీలకు ఏమైనా మంచి చేసే విధానాలు ప్రవేశపెట్టలేదు కానీ, మత విద్వేషంతో 10 కోట్ల మంది ముస్లిం స్త్రీల 'తలాక్' చట్టం సవరించేశారు. ఈ ద్వేష భావనలు కాకుండా దేశంలోని స్త్రీలందరికి ఉపయోగకరమైన 30 శాతం ఉద్యోగ నియామకాల బిల్లు తేవచ్చు కదా! అంటే మోదీ ముస్లిం స్త్రీలకు సహాయం చేద్దామని కాదు ఆ చట్టం తెచ్చింది. వారి కుటుంబాలలో చిచ్చు పెట్టడానికి! ఒక విధానమే కాదు, దాని వెనుకనున్న ఆలోచన కూడా మంచిదై ఉండాలి.

స్త్రీల పట్ల మోదీకి ఉన్న చిన్నచూపు తరచూ బయటపడుతూనే ఉన్నది. స్త్రీ ద్వేషం, మత ద్వేషం ఉన్నవాడు భారత్ లాంటి వైవిధ్యభరిత సంస్కృతి ఉన్న దేశానికి అధినేతగా తగినవాడేనా? ఆలోచించండి. మానవ విలువలు నాశనం చేసే ఇటువంటి నకారాత్మక ఆలోచనలు ఉన్నవాడు అసలు నాయకత్వానికి పనికివస్తాడా? అందుకే మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిని చేయడాన్ని వాజపేయి వ్యతిరేకించారు. ఇక గుజరాత్ ముఖ్యమంత్రిగా ముస్లిం ల పట్ల, వారి మహిళల పట్ల జరిగిన అన్యాయాలకు అంతే లేదు. ఎదిరించిన జర్నలిస్టుల నిర్బంధం, అమిత్ షా కేసు చేస్తున్న జడ్జి ఆకస్మిక, అనుమానాస్పద మరణం ఏం సూచిస్తున్నాయి? మహిళా రెజ్లర్ల నిరసన, వారి పట్ల మోదీ చూపిన నిరాదరణ ఆయన స్త్రీ ద్వేషాన్ని ప్రతిబింబించటం లేదా? మణిపూర్‌లో జరిగిన అత్యాచారం, అనాచారాల్ని ఇప్పటిదాకా మోదీ ఖండించలేదు. ఆ రాష్ట్రానికి మొహం చాటేశాడు. ఈయన దేశానికి ప్రధాని అనటానికే సిగ్గు పడాలి ప్రజలు!

తనకంటే గొప్పగా, ఇంకే నాయకుడూ దేశంలో చేయనంత బ్రహ్మాండమైన పరిపాలన అందించిన కేసీఆర్‌ను లొంగదీయాలంటే దుర్యోధన మంత్రంగా ఆయన కూతురిని బాధపెట్టడం ఎంతవరకు న్యా యం? కవితను నిర్బంధించిన ఒక్క కారణమైనా నిరూపితమైందా? అయిదు నెలలు ఆవిడను బాధపెట్టినందుకు, నిరాధారంగా నిర్బంధించినందుకు మోదీ మీద ఏ కేసు వేయాలి? న్యాయం, చట్టం, ధర్మం అందరి పట్ల ఒక్కటే అయితే, ఈ అన్యాయం ఎట్లా సరిదిద్దుతారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలి. ఈ అధర్మ పాలనను ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. న్యాయ పోరాటం చేయాలి. అధికార దుర్వినియోగం చేసే వారికి తగినరీతిలో బుద్ధి చెప్పాలి.

నేడు పీవోడబ్ల్యూ మహాసభలు

మహిళల హక్కుల కోసం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) అర్ధ శతాబ్దకాలంగా పనిచేస్తున్నది. 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థినుల చొరవతో ఆవిర్భవించిన ఈ సంఘం మొదట మహిళలపై వేధింపులు, అసభ్య సాహిత్యానికి, వరకట్న హత్యలకు వ్యతిరేకంగా పోరాడింది. ఆ తర్వాత అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాలుపంచుకున్నది. పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పోరాడే మహిళా సంఘాలు అవసరమని.. కార్మిక, కర్షక వర్గాలతో కలిసి పోరాడాలనే ఉద్దేశంతో ఏర్పడిన అభ్యుదయ మహిళా సంఘం ఆ తర్వాత ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ)గా మారింది.

ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో సమానత్వం కోసం, శ్రామికవర్గ మహిళల విముక్తి కోసం పోరాడుతూనే ఉన్నది. మహిళల ఆర్థిక స్వావలంబన మహిళా సాధికారతను, సమానత్వ హక్కును ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం రోజురోజుకు తగ్గిపోతున్నది. పలు రంగాల్లో పురుషులతో సమానంగా వేతనాలు పొందడం లేదు. ఆశావర్కర్లుగా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులుగా లక్షలాది మంది మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు కార్మికవర్గ హక్కులను కాలరాస్తున్నాయి. వ్యవసాయం కార్పొరేటీకరణ వల్ల రైతులు భూములను కోల్పోతున్నారు. తద్వారా వ్యవసాయ రంగంలో మహిళల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.

దేశంలో మహిళా హక్కులపై గతంలో ఎన్నడూ లేనంతగా దాడులు జరుగుతున్నాయి. ఇంటాబయట మహిళలు ఎదుర్కొంటున్న హింస, దౌర్జన్యాలకు అంతులేకుండా పోతున్నది. మల్ల యోధులపై లైంగికవేధింపులకు పాల్పడిన బీజేపీ నేత, మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయడానికి పోరాడాల్సి వచ్చింది. ఆయనపై పోరాడిన సాక్షిమాలిక్ తనకు తానుగా పోటీల నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినేశ్ ఫోగట్ కేవలం 100 గ్రాముల బరువు కారణంగా కుట్రపూరితంగా ఒలింపిక్స్‌లో అనర్హత వేటుకు గురయ్యారు. బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన దుర్మార్గులకు క్షమాభిక్ష పెట్టడమే కాకుండా సన్మానాలు చేస్తున్నారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, నగ్న ఊరేగింపులు జరుగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న మానవ హక్కుల కార్యకర్త అరుంధతి రాయ్ లాంటివారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలైనా మహిళలకు ఇచ్చిన అనేక వాగ్దానాలను నెరవేర్చలేదు. తక్కువ ధరకే గ్యాస్, ఉచిత విద్యుత్తు, పింఛన్లు, రేషన్‌కార్డులు, మహిళలకు ఆసరా లాంటి హామీలను ఇప్పటికీ అమలు చేయలేదు. రాష్ట్రంలో మహిళలు, పసిపిల్లలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయి. వీటిని వెంటనే అరికట్టాల్సి ఉన్నది.

స్త్రీల వైద్యం, విద్య, ఉద్యోగ, వివాహ తదితర అంశాలకు సంబంధించి పితృస్వామిక ఆధిపత్య బంధనాలను ముందుకుతెస్తున్న మోదీ కార్పొరేటీకరణ, మనువాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉన్నది. మోదీ ఫాసిస్టు పాలనా విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక అవకాశాలను రక్షించుకోవడానికి పోరాటాలను బలోపేతం చేయాల్సిన తరుణంలో ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర ఏడో మహాసభలను నిర్వహిస్తున్నది. మహిళా ఉద్యమ కర్తవ్యాలను నిర్దేశించుకోబోతున్న ఈ సభలు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ప్రముఖులు పాల్గొననున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గం విజ్ఞప్తి చేస్తున్నది.

(ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రచురించిన కరపత్రం నుంచి)

అట్టడుగున మనం.. అగ్రపథాన చైనా

భారత్, చైనా.. ప్రపంచంలోనే అత్యధిక జనాభాను కలిగి ఉన్న మొదటి రెండు దేశాలు. రెండు దేశాలు కూడా భారీ భూభాగం, ప్రాచీన నాగరికత, అణ్వస్త్ర సామర్థ్యం, శక్తిమంతమైన సైన్యం, బలమైన రాజకీయ భౌగోళిక ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ సారూప్యతలు ఇక్కడితోనే ముగుస్తాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా చైనా ఉండగా.. భారత్ మాత్రం ఇప్పటికీ ఎదుగుతున్న ఆర్థిక శక్తిగానే ఉండటమే అందుకు కారణం. 1980లలో ఆర్థిక వ్యవస్థల పరిమాణం పరంగా రెండు దేశాల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. వాస్తవానికి ఆ సమయంలో భారత తలసరి ఆదాయం చైనా కంటే ఎక్కువే. అయితే 2024లో జీడీపీ, తలసరి ఆదాయం, ప్రపంచ ఎగుమతుల్లో వాటా పరంగా చూస్తే భారత్ కంటే చైనా చాలా ముందంజలో ఉన్నది.

ప్రిన్స్ త్యాగి

జీడీపీ: ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం.. 2024లో చైనా ఆర్థిక వ్యవస్థ విలువ 18.53 ట్రిలియన్ డాలర్లు. ఇది భారత జీడీపీ 3.93 ట్రిలియన్ డాలర్ల కంటే సుమారుగా ఐదింతలు ఎక్కువ. 1980ల నుంచి చూసుకుంటే చైనా జీడీపీ 61 రెట్లు పెరిగి 303 బిలియన్ డాలర్ల నుంచి 18.53 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. అదే సమయంలో 21 రెట్లు మాత్రమే పెరిగిన భారత జీడీపీ 189 బిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. గత పదేండ్లలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో 93 శాతం పెరిగిన భారత జీడీపీ 2.04 ట్రిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో 76 శాతం పెరిగిన చైనా జీడీపీ 10.5 ట్రిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుత స్థితికి చేరింది.

2004-14 మధ్యకాలంలో యూపీఏ హయాంలో భారత జీడీపీ 188 శాతం పెరిగి.. 704 బిలియన్ డాలర్ల నుంచి 2,039 బిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 440 శాతం పెరిగి 1.95 ట్రిలియన్ డాలర్ల నుంచి 10.5 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది.

తలసరి జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 2024లో చైనా తలసరి జీడీపీ 25,015 డాలర్లుగా ఉన్నది. ఇది భారత జీడీపీ 10,123 డాలర్ల కంటే రెండున్నర రెట్లు అధికం. 1980లలో భారత తలసరి ఆదాయం 582 డాలర్లుగా ఉన్నది. ఇది అప్పటి చైనా తలసరి ఆదాయం 307 డాలర్ల కంటే సుమారు రెండు రెట్లు ఎక్కువ. 1980ల నుంచి చైనా తలసరి ఆదాయం 82 రెట్లు పెరిగింది. అదే సమయంలో భారత తలసరి ఆదాయం 17 రెట్లు మాత్రమే పెరగడం గమనార్హం. మోదీ హయాంలో గత పదేండ్లలో భారత తలసరి ఆదాయం 95 శాతం పెరిగింది. 2014లో 5,187 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2024 నాటికి 10,123 డాలర్లకు చేరుకున్నది. అదే సమయంలో చైనా తలసరి ఆదాయం 100 శాతం పెరిగి.. 12,496 డాలర్ల నుంచి 25,015 డాలర్లకు ఎగబాకింది. 2004-14 మధ్యకాలంలో మన్మోహన్ సింగ్ హయాంలో 93 శాతం పెరిగి.. 2,681 డాలర్ల నుంచి 5,187 డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 185 శాతం పెరగడం గమనార్హం.

జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు: 2024లో భారత జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు 82.5 శాతం ఉండగా.. చైనా ప్రభుత్వ స్థూల అప్పు 88.6 శాతం ఉన్నది. 1995లో భారత స్థూల అప్పు 71 శాతం ఉండగా.. చైనా స్థూల అప్పు 21.6 శాతం ఉండేది. 2004-14 మధ్యకాలంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పు 84.9 శాతం నుంచి 67.1 శాతానికి తగ్గింది. 2014-24 మధ్యకాలంలో బీజేపీ హయాంలో ప్రభుత్వ అప్పు 67.1 శాతం నుంచి 82.5 శాతానికి ఎగబాకింది.

ఎగుమతులు: వరల్డ్ బ్యాంకు డాటా ప్రకారం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకారం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం. అదే సమయంలో 0.78 ట్రిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులతో భారత్ పదో స్థానంలో ఉన్నది. ఈ లెక్కన భారత్‌తో పోలిస్తే చైనా ఎగుమతులు సుమారుగా ఐదింతలు ఎక్కువ కావడం గమనార్హం.

వరల్డ్ బ్యాంకు డాటా ప్రకారం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకారం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం.

ద్రవ్య క్రమశిక్షణ పాటిస్తూనే, మౌలిక వసతుల అభివృద్ధి, దేశీయ తయారీపై దృష్టి సారిస్తూ ఈ వృద్ధిని ఇలాగే కొనసాగిస్తే.. భారత్ కూడా ప్రపంచ శక్తిగా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో ఒకటిగా నిలవగలదని నిపుణులు సూచిస్తున్నారు.



వివక్షకు గురైన సమూహంలోనే వివక్షకు గురికావడమనేది వేరే దేశాల్లో అయితే చాలా అరుదు. కానీ, మన దేశంలో సహజాతి సహజం. ఈ దేశంలోని హిందూ వర్ణ వ్యవస్థ, దాని ప్రధాన భాగమైన నిచ్చెన మెట్ల కులవ్యవస్థలే దానికి కారణం. ఈ నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో కిందకి పోతున్నకొద్దీ వివక్షకు గురవుతున్న సమూహంలోని సభ్యుల మధ్య అసమానత్వం ఇంకా స్పష్టంగా కనబడుతూనే ఉంటుంది.

పంచుకోవడంలో.. పంచాయితీ ఎందుకు?

దిలీప్.వి
84640 30808

వెనుకబడిన వర్గాల్లో కంటే దళిత కులాల్లో అసమానత్వం స్పష్టంగా కనపడుతుంది. అందుకే ఎస్సీ వర్గీకరణను ఉద్దేశించి బాలగోపాల్ 'ఇది దోపిడీ, అణచివేతలకు సంబంధించిన అంశం కాదు. ఇది అణచివేతకు గురైన సమూహంలోనే అసమానతలకు సంబంధించిన అంశం. దీని మూలాలు హిందూ వర్ణ వ్యవస్థలో, దాని ప్రధాన భాగమైన నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఉన్నాయ'ని అన్నారు. అణచివేతకు గురైన సమూహంలోని అసమానతకు గురయ్యే వర్గం.. ఆ అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక సమానత్వం కోసం పోరాడటమనేది ఒక చైతన్యవంతమైన చర్యగా చూడాలి. సామాజిక న్యాయసాధన దిశగా జరిగే పోరాటంగా చూడాలి. అట్లా చూసినప్పుడే ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయవచ్చని ఇచ్చిన తీర్పుని అర్థం చేసుకుంటారు, స్వాగతిస్తారు.

ఈ దేశంలో వివక్షకు గురైన ఎస్సీ కులాల్లోనే ఎంతటి వివక్షను పాటిస్తారనేది దళిత వాడలను ఎరిగిన ఎవరికైనా సులభంగా అర్థమైతది. ఈ వాస్తవాన్ని మరుగునపెట్టి ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ తీర్పు అన్యాయం, దీని వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని కొందరు గగ్గోలు పెడుతు న్నారు. నిన్నటివరకు సామాజిక చింతనా పరులుగా ఉన్నవాళ్లు, సామాజిక న్యాయాన్ని కోరుకుంటున్నామనే వాళ్లు ఆ తీర్పు రాగానే వాళ్లలో ఉన్న సంకుచిత తత్వాన్ని బయటపెట్టుకుంటున్నారు. చట్టసభల్లో మాలలకు అన్యాయం జరుగుతుందని గగ్గోలు పెడుతున్నారు. అలాంటి వాళ్లందరికీ ఒక ప్రశ్న. వర్గీకరణ అంశం ముందుకు వచ్చినపుడే ఒక వర్గానికి అన్యాయం జరుగుతుందని గుండెలు బాదుకోవడం ఎందుకు? ఏ సమాజంలోనైనా ఎక్కువగా ఫలాలు అనుభవించిన సమూహం వాటిని వదులుకోవడానికి అంత సులభంగా ఒప్పుకోదు. జనా భా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలన్నపు డు వ్యతిరేకించిన అగ్ర వర్ణ వ్యవస్థలన్నీ.. మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిన అన్ని సందర్భాల్లో ఇదే నిజమైంది. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే సందర్భంలో కొందరు అట్లానే మాట్లాడుతున్నారు.

'వర్గీకరణ వల్ల దళిత సమాజం చీలిపోతుంది. ఇది పాలకవర్గాల కుట్ర' అని మాట్లాడుతూ చాలా మంది భయాన్ని వ్యక్తం చేస్తున్నట్టు, మొత్తం దళిత సమాజంపై ప్రేమ ఉన్నట్టు మాట్లాడుతున్నారు. వర్గీకరణ పాలక వర్గాల కుట్ర కావచ్చు. కానీ, దానివల్ల సామాజిక న్యాయం దక్కాల్సిన సమూహాలకు దక్కుతుందా లేదా? అనేది చూడాలి. దళితులను వర్గీకరణతో విభజించి, అనైక్య పరుస్తారని భయమెవరికన్న ఉంటే అది అపోహ మాత్రమే.

రాజకీయ రంగాల్లో రాజ్యాంగంలో విధించిన పరిమితి మేరకు మాత్రమే సీట్లిచ్చి అన్ని పాలకవర్గాలు చేతులు దులుపుకొంటున్నాయి. వారి వారి రిజర్వేషన్ల వరకే వారిని పరిమితం చేస్తున్నారు. నిజానికి వర్గీకరణ వల్ల మాలమాదిగల ఐక్యత పోతుందనుకునే నాయకులు దళితవర్గాల ఐక్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో క్యాబినెట్ మంత్రిత్వ శాఖల్లో కూడా 'మా వాటా ప్రకారం మాకు మంత్రిత్వ శాఖలు ఇవ్వాల'ని ఒక ఉమ్మడి ఉద్యమం తీసుకురండి. రాష్ట్రాలకు ముఖ్యమంత్రులను, దేశ ప్రధానిగా వ్యక్తులను ఎన్నుకునేటప్పుడు రొటేషన్ పద్ధతిలో దళితులకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయండి. దీనిద్వారా దళిత జాతి మొత్తాన్ని రాజ్యాధికారం దిశగా నడిపించవచ్చు. దళితజాతి ఐక్యతను చాటవచ్చు.

ఈ దేశంలో ఎస్సీ ఎస్టీల అభివృద్ధి కోసమని కేటాయిస్తున్న అరకొర నిధులను కూడా ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయి. అంతే కాకుండా సంక్షేమ పథకాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు కూడా సబ్‌ప్లాన్ నిధుల్లో నుంచే ఖర్చుపెట్టి ఎస్సీల అభ్యున్నతికి ఎంతో ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకొంటున్నాయి. దళితుల ఐక్యతను చాటుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించేటట్టు ఐక్య ఉద్యమాలు చేసి ఐక్యతను చాటుకోవచ్చు.

ఈ దేశంలో ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు తీసేయడానికి కుట్రలు జరుగుతున్నవి. వాటిని అడ్డుకోవడానికి ఐక్య ఉద్యమాలు చేయవచ్చు. దేశంలో ఉన్నత విద్యను మొత్తంగానే ప్రైవేటీకరణ చేసి, విద్యాసంస్థల్లో ఎటువంటి రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఉద్యమం చేయండి. దీనిద్వారా దళిత వర్గాల ఐక్యతే కాదు, మొత్తం బహుజనవర్గాల ఐక్యతను చాటుకోవచ్చు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే సామాజిక న్యాయభావనను వ్యతిరేకించడమే. నిజానికి సామాజిక న్యాయ వర్గీకరణ వల్ల ఐక్యత దెబ్బతింటుందని మాట్లాడేవాళ్లందరూ ఒక విషయం ఆలోచించాలి. ఏ సమూహాలైతే అన్యాయానికి గురవుతున్నాయో ఆ సమూహాలతో న్యాయమైన పంపిణీ చేసుకొని ఇంకా దక్కాల్సిన రాజ్యాంగ ఫలాల కోసం ఉమ్మడిగా కలిసికొట్లాడినప్పుడు మాత్రమే నిజమైన ఐక్యత సాధించగలుగుతారు. ఎస్సీ వర్గీకరణను మాత్రమే కాదు, ఏ వర్గీకరణను కూడా ఉత్త పంపకంగా చూడకూడదు. వివక్షాపూరితమైన, అసమానతకు గురవుతున్న సమూహాల్లోని ప్రజలలోనే వివక్షకు గురవుతున్న సమూహాల సామాజిక న్యాయకాంక్షగా చూసినప్పుడే వర్గీకరణలో గల న్యాయమైన సూత్రాన్ని అర్థం చేసుకోగలుగుతారు.

శాంతిస్థాపకుడు మణిపూర్‌లో శాంతిని స్థాపించలేరా?

దాదాపుగా 16 నెలలుగా మణిపూర్ రాష్ట్రం అల్లర్లతో అట్టుడుకుతున్నది. అక్కడ శాంతి, సామరస్యం, సాధారణ పరిస్థితులు కనిపించడం లేదు. విశ్వసనీయతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ కోల్పోయారు. ప్రపంచం మొత్తం తిరిగి శాంతిస్థాపకుడి పాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తున్న మోదీ.. కాలిపోతున్న మణిపూర్‌కు వెళ్లి, అక్కడ ఎందుకు శాంతిని స్థాపించలేకపోతున్నారు?

- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నేత